


# తెలంగాణకు గ్లోబల్ కంపెనీల క్యూ

## టీఎంయూఎస్ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** విభిన్న రంగాలకు చెందిన నిపుణులైన మానవ వనరులు అందుబాటులో ఉన్నందున అనేక సంస్థలు తమ నూతన కేంద్రాల ఏర్పాటు, తదుపరి విస్తరణల కోసం హైదరాబాద్ వస్తున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. గురువారం అమెరికా టెలికాం దిగ్గజం టీఎంయూఎస్ (టీమొబైల్ యూఎస్) గ్లోబల్ సొల్యూషన్స్ నూతన గ్లోబల్ టెక్నాలజీ సెంటర్‌ను మంత్రి హైటెక్ సిటీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ భారీ టెక్నాలజీ సెంటర్ వచ్చే ఏడాది చివరి నాటికి వెయ్యి మంది నిపుణులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తుందన్నారు. ఇప్పటికే 450 జీసీసీ కేంద్రాలకు నెలవుగా మారిన హైదరాబాద్.. ఈ ఆధునిక కేంద్రంతో మరింత గుర్తింపును తెచ్చుకుందని చెప్పారు. తమ ప్రభుత్వం సృష్టించిన అత్యంత అనుకూలమైన ఎకో సిస్టం వల్ల సాంకేతికత, ఇంజినీరింగ్, జీవ విజ్ఞానాల ఆవిష్కరణల కేంద్రంగా తెలంగాణ గ్లోబల్ కంపెనీలను ఆకర్షిస్తున్నదని వివరించారు. సెమీకండక్టర్స్, బ్యాంకింగ్/ఫైనాన్స్, రిటైల్, జీవ విజ్ఞానం (లైఫ్ సైన్సెస్), బ్యూటీ రంగాలకు సంబంధించిన జీసీసీ కేంద్రాలు ఇక్కడ నుంచి ప్రపంచవ్యాప్తంగా తమ కార్యకలాపాలు సాగిస్తున్నాయని చెప్పారు. కాగా.. టీమొబైల్ యూఎస్ అమెరికాలోని అతి పెద్ద వైర్‌లెస్ నెట్‌వర్క్ ఆపరేటర్లలో ఒకటిగా ఉన్నది. 14 కోట్లకుపైగా వినియోగదారులకు సేవలు అందిస్తున్నది. ఈ కార్యక్రమంలో సంస్థ గ్లోబల్ సొల్యూషన్స్ వైస్ ప్రెసిడెంట్ చంద్ర గుప్త, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ శివారులో పెట్రోల్ ట్యాంకర్ బీభత్సం.. హైఅలర్ట్



**విశ్వంభర, హైదరాబాద్ :** నగర శివారు పెద్ద అంబర్‌పేట సమీపంలో ఆయిల్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. పెట్రోల్‌తో వెళ్తున్న ట్యాంకర్.. లక్ష్మారెడ్డిపాలెం వద్ద రెండు కార్లను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కార్లు రెండూ ధ్వంసమయ్యాయి. అందులో ప్రయాణిస్తున్న వారు స్వల్పంగా గాయపడ్డారు. ట్యాంకర్ క్యాబిన్‌లో ఓ వ్యక్తి చిక్కుకోవడంతో అతడిని రక్షించేందుకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. అతికష్టంపై అతడిని బయటకు తీశారు. ఆ వ్యక్తి కాలికి తీవ్రగాయం కావడంతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. మరోవైపు ట్యాంకర్ నుంచి పెట్రోల్ లీకవుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఘటనాస్థలిలో హైఅలర్ట్ ప్రకటించారు. పెట్రోల్ ట్యాంకర్ సమీపంలోకి ఎవరినీ రానివ్వకుండా చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంతో విజయవాడహైదరాబాద్ హైవేపై భారీగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనాలను పోలీసులు జాతీయ రహదారి నుంచి సర్వీసు రోడ్డులోకి మళ్లిస్తున్నారు.

# హైదరాబాద్‌లో బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. బీటెక్ విద్యార్థి మృతి

**విశ్వంభర, హైదరాబాద్:** బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. సికింద్రాబాద్‌లోని జలమండలి కార్యాలయం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడిని గురునానక్ కళాశాలకు చెందిన విశాల్ మదన్‌గా గుర్తించారు. బైక్‌పై జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి ఉప్పల్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

# భార్యను హతమార్చి.. ఆపై పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన భర్త



**విశ్వంభర, మూసాపేట :** కుటుంబ కలహాల నేపథ్యంలో కత్తితో భార్య గొంతు కోసి హతమార్చాడో కిరాతక భర్త. అనంతరం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆస్మరా బేగం (24), షేక్ రహీంలకు 2024లో వివాహం జరిగింది. ప్రస్తుతం వారిద్దరూ కుటుంబంతో కలిసి కైతలాపూర్‌లోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. రహీం ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. ఆస్మరా బేగం ఇంట్లోనే ఉంటోంది. కాగా వివాహం జరిగినప్పటి నుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై గతంలో దంపతులిద్దరూ వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే గురువారం ఉదయం మరోసారి వారి మధ్య గొడవ జరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన రహీం కత్తితో భార్య గొంతు కోసి హతమార్చాడు. అనంతరం నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

# వ్యవసాయంలో మార్పులకు సిద్ధంకావాలి




**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో రైతులను ముందుగానే అప్రమత్తం చేసి ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని అధికారులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. రైతులకు తక్కువ నీటితో సాగు చేయగల పంటలు, వర్షాభావాన్ని తట్టుకునే పంటలు, ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాలపై గ్రామసభల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

గురువారం సచివాలయంలో వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి లిఫ్ట్ ఇరిగేషన్, బోరు బావులు ఆధారిత సాగు ప్రాంతాలలో తక్కువ పంటకాలం కలిగిన సన్నరకం వరి రకాలను ప్రోత్సహించడంతో పాటు ఆరుతడి పంటల సాగుపై రైతులను దృష్టి సారింపజేయాలని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల ఎంపిక చేసుకునేలా వ్యవసాయ విస్తరణ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. పంట వ్యర్థాలను కాల్చివేయడం వల్ల నేల సారవంతత దెబ్బతినడంతో పాటు పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని, నాగర్‌కర్నూల్ జిల్లాలో పంట వ్యర్థాల కాల్చివేతలకు సంబంధించిన శాటిలైట్ చిత్రాలు పరిశీలించారు. ఇదే విధంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి శాటిలైట్ ఆధారిత నివేదికలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 6వ తేదీన కొహెడలో రూ.2,284.32 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారని, ఇది రాష్ట్ర మార్కెటింగ్ రంగానికి మైలురాయిగా నిలుస్తుందన్నారు. వ్యవసాయశాఖ పరిధిలోని వివిధ విభాగాలకు చెందిన ఖాళీ స్థలాలను ఇప్పటికే గుర్తించామని, ఈ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం నెల రోజుల వ్యవధిలో ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, ఆస్తుల పరిరక్షణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చి ఆదాయ వనరులు సమకూర్చుకునే అవకాశాలను పరిశీలించాలని, అది సాధ్యంకాని చోట్ల విస్తృత స్థాయిలో ప్లాంటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

### తెలంగాణ ఫెర్టిలైజర్ యాప్‌కు మరోసారి కేంద్రం ప్రశంసలు..

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్ పనితీరును కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ మరోసారి ప్రశంసించిందని మంత్రి తెలిపారు. ఎరువుల పంపిణీ, వినియోగ పర్యవేక్షణలో తెలంగాణ అమలు చేస్తున్న విధానం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్‌ను రాష్ట్రంలోని పైలట్ జిల్లాల్లో సమర్థవంతంగా అమలు చేయాలని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ కార్యదర్శి కోరినట్లు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ యాప్ అమలు దిశగా చర్యలు తీసుకోవాలని కేంద్రం సూచించిందన్నారు. యాప్‌ను సమర్థవంతంగా అమలు చేస్తే రాష్ట్రానికి ప్రోత్సాహకాలు కూడా అందజేస్తామని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ హామీ ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు.

# ఉద్యమకారులను పిలిచి మాట్లాడతాం: కేకే




**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి రాజకీయ, ఉద్యమ పార్టీల వారి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరించామని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఛైర్మన్ కే.కేశవరావు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ఏర్పాటైన గుర్తింపు కమిటీ గురువారం తెలంగాణ సచివాలయంలో రాష్ట్రంలోని రాజకీయ పార్టీలతో అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి కాంగ్రెస్ నుంచి మహబూబాద్ ఎంపీ, బలరాం నాయక్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, టీడీపీ, న్యూడెమక్రసీ, ఆప్, టీజేఎస్, పార్టీల తరుపున ఇద్దరు ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలను కమిటికి తెలిపారు. సమావేశం అనంతరం కే.కేశవరావు మీడియాతో మాట్లాడుతూ విద్యార్థి సంఘాలను, అడ్వకేట్, డాక్టర్, ఉద్యమంతో సంబంధం ఉన్న వారిని కూడా పిలిచి మాట్లాడతామని, కమిటీ మొదటి ప్రాధాన్యతగా అర్హులైన ఉద్యమకారులను గుర్తించడం, వారిని గౌరవించడం, తొలి తరం ఉద్యమకారులను గుర్తించడానికి అనేక సమావేశాలను నిర్వహిస్తోందన్నారు. ఉద్యమకారుల ఐడెంటిటీ పై వర్క్ డివైడ్ చేస్తామని, ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీలతో నిర్వహించిన రెండవ మీటింగ్ లో హాజరైన ప్రతి ఒక్కరి అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. తెలంగాణకు మద్దతు ఇచ్చిన పార్టీలని ఐక్యంగా అందరివి అభిప్రాయాలను తీసుకున్నామని, కమిటీ నివేదిక కు టైమ్ బాండ్ ఆలోచిస్తున్నామని కేకే చెప్పారు. సమావేశానికి హాజరైన ప్రతి పార్టీలు ప్రభుత్వాన్ని సీఎం రేవంత్ రెడ్డిని అభినందించారని కేకే తెలిపారు.

### ఉద్యమకారులకు గౌరవం ఇస్తాం - మంత్రి పొన్నం..

ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ఏర్పాటు చేసిన కమిటీ పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్థులు, జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతామని, ఉద్యమంలో గాయాలు పాలైన వారు, వివిధ రకాలుగా నష్టం జరిగిన వారికి న్యాయం చేస్తామని కమిటీ సభ్యుడు, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కవులు, కళాకారులు, తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తిస్తామని ఆయన వెల్లడించారు. గుర్తింపు కమిటీ కార్యాలయం అమరవీరుల ద్వీపంలో ప్రారంభం అవుతుందని, ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని, గుర్తించాలని భావిస్తోందని దానిలో భాగంగానే అందరి దగ్గర సూచనలు స్వీకరించామన్నారు. రాజకీయాలకు అతీతంగా సలహాలు సూచనలు స్వీకరిస్తామని, ఆన్లైన్ ఆఫ్ లైన్ లోనూ విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం వివరించారు.

### ఉద్యమకారులందరిని కలుస్తాం - కోదండరాం..

ఉద్యమకారుల జెఏసీలు చాలా ఉన్నాయని, వారందరిని కలుస్తామని ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం చెప్పారు. అన్ని యూనివర్సిటీల జేఏసీలను కలుస్తామని, సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. చాలా మంది తెలంగాణ ఉద్యమకారులు ఉద్యమంలో జీవితం యవ్వనం పోయిందని, తమను ఆదుకోవాలని కోరుతున్నారని కోదండరాం తెలిపారు.

### ప్రజా, విద్యార్థి సంఘాలు, సబ్బండ వర్గాలతో సమావేశం: అద్దంకి దయాకర్..

ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు సబ్బండ వర్గాలతో సమావేశం అవుతామని, 1969 ఉద్యమకారులను కూడా ఐడెంటిఫై చేయాలని రాజకీయ పార్టీలు చెప్పాయని ప్రభుత్వ విప్, అద్దంకి దయాకర్ అన్నారు. చనిపోయిన వాళ్ళు, గాయపడిన వారు, కేసులతో జైలుకు పోయిన వారిని గుర్తించి గౌరవించుకోవాలన్నది సీఎం ఆలోచన అని ఆయన తెలిపారు. మొదటి దశలో రాజకీయ పార్టీల నుండి తీసుకున్నామని, తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన, ఉద్యమించిన అన్ని సంఘాల అభిప్రాయాలు తీసుకుంటామని అద్దంకి దయాకర్ చెప్పారు.




సొసైటీ ఫర్ పొలిటికల్ ఎంపవర్ మెంట్ విత్ యాక్షనబుల్ నాలెడ్జ్ ( SPEAK) ఆధ్వర్యంలో పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గా నూతనంగా నియమితులైన గూడూరు శ్రీనివాస్ కి ఖైరతాబాద్ లోని విశ్వేశ్వరయ్య భవన్ లో ఘనంగా సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యవర్గం పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి




**విశ్వంభర, మేడ్చల్ :** వడ్ల కొనుగోలు ప్రక్రియలోని సమస్యలను వర్షాకాలం లోపు వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ డి.విజయేందర్ రెడ్డి కి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ముఖ్య నాయకుల బృందం డి.జి.నరేందర్ ప్రసాద్ అధ్యక్షతన వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. రైతులు పండించిన వడ్ల కొనుగోలు ప్రక్రియలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల నిర్వహణలో లోపాలు, రవాణా సమస్యలు, గోనె సంచులు అందుబాటులో లేకపోవడం, అమాలీల కొరత, గోదాముల కొరత వంటి సమస్యల వల్ల రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఐదు రోజుల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ట్రాక్టర్లు రోడ్డుపైకి వచ్చి రాస్తారోకో నిర్వహించారని తెలిపారు. వడ్ల కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, రైతులు అమ్మిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు వీలైనంత త్వరితగా తిన రైతులు అమ్మిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు వీలైనంత త్వరితగతిన బ్యాంకు ఖాతాలో జమ చేయాలని, మేడ్చల్ జిల్లాలోని తగినన్ని పెద్ద మిల్లులు ఏర్పాటు చేసి ఇక్కడ సేకరించిన ధాన్యాన్ని ఇక్కడ మిల్లులకే కేటాయిస్తే రవాణాకు తక్కువ సమయంలో ధాన్యం సేకరణ త్వరగా జరిగేందుకు ఆస్కారం ఉంటుందని డిజి నరేందర్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి.జంగయ్య, కార్యదర్శి నిమ్మల నరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.హెచ్ దశరథ , పి.నరసింహ, పి సత్యనారాయణ, ఎం.శ్రీకాంత్ రెడ్డి, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# అమీర్‌పేటలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం




**విశ్వంభర, హైదరాబాద్ :** అమీర్‌పేటలోని ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో గురువారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం జరిగింది. మెట్రో పిల్లర్ నెంబరు 1043 సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్ రెండో అంతస్తులో ఉన్న కేఎస్ఆర్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు చెలరేగాయి. క్రమంగా ఇతర దుకాణాలకూ వ్యాపించాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది 3 ఫైరింజన్లు, 8 వాటర్ ట్యాంకర్లతో మంటలు అదుపు చేశారు. ఇతర దుకాణాల్లోని వారిని ఖాళీ చేయించారు. అమీర్‌పేటలోని ప్రధాన రహదారికి సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రమాదం జరగడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దట్టమైన పొగ అలముకోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో దుకాణాల్లో సిబ్బంది బయటకు పరుగులు తీయడంతో ప్రాణనష్టం తప్పింది. భారీగా ఆస్తి నష్టం జరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో హెల్మెట్ షాపు ఉండటంతో ప్లాస్టిక్ సామగ్రి దగ్ధమై మంటల తీవ్రత ఎక్కువగా ఉందని అగ్నిమాపకశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

# తెలంగాణ లాసెట్ ఫలితాలు విడుదల..



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ లాసెట్, పీజీఎల్‌సెట్ ప్రవేశ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. హైదరాబాద్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో వీటిని విడుదల చేశారు. మూడు, ఐదేళ్ల లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీ లాసెట్), పీజీ లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీ పీజీఎల్‌సెట్) ప్రవేశ పరీక్షలను ఈ ఏడాది హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం మే 18న నిర్వహించింది. పరీక్షకు హాజరైన అభ్యర్థులు ఫలితాలు, స్కోర్ కార్డు వివరాలను కింది లింక్‌పై క్లిక్ చేసి పొందొచ్చు. హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

## మోసపూరిత హామీలతో..

# నిరుద్యోగులను దగా చేసిన కాంగ్రెస్ పార్టీ

- నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ప్రకటనలకే పరిమితం
- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్




విశ్వంభర, ఎల్బీనగర్ : ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీ ఇచ్చి నిరుద్యోగులను దగా చేసిందని తెలంగాణ మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అన్నారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో వేలాదిమంది నిరుద్యోగులతో గురువారం దిల్సుఖ్నగర్లోని భాగ్యశ్రీ ఫంక్షన్ హాల్లో 'నిరుద్యోగుల వంచన' సభ నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న తలసాని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తి అయినా అన్ని రంగాల్లో ఘోరంగా విఫలం అయిందన్నారు. భారత చరిత్ర పుటల్లో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది. కేసీఆర్ అయితే వెనక ఉండి ఉద్యమం సాగింది యావత్ తెలంగాణ యువత అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి సాధించిన తెలంగాణ రాష్ట్రంలో నూటికి నూరు శాతం తమ పిల్లలకే ఉద్యోగాలు ఇవ్వాలని కేసీఆర్ సంకల్పించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 1.8 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయటం జరిగిందని, మరో 42వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తే కోర్టు స్టేతో ఆగిపోయాయని తెలిపారు. అబద్ధపు హామీలతో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి అబద్ధాల కోరుగా మారారని అన్నారు. 70 వేల ఉద్యోగాలు, లక్ష ఉద్యోగాలు భర్తీ చేశామని రేవంత్ రెడ్డి, మంత్రులు వేర్వేరుగా ప్రకటనలు ఇస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు చెబుతున్నారని దుయ్యబట్టారు. సరూర్నగర్ సభలో ప్రియాంకగాంది, అశోక్నగర్లో రాహుల్గాంది విద్యార్థులకు, . ఫీజు రీఅంబర్స్మెంట్, నిరుద్యోగ బృతి ఇస్తామని మోసం చేసిన రేవంత్ ప్రభుత్వానికి, రాహుల్ గాంధీకి సిగ్గులేదని అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా కేసీఆర్ నోటిఫికేషన్లు ఇవ్వటానికి వెనకాడలేదన్నారు. ఉద్యోగాల నియామకాలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఎండగడతామని, వదిలే ప్రసక్తేలేదన్నారు. నిరుద్యోగలు ఏ అఘాయిత్యాలకు పాల్పడవద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయితేనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రభుత్వం మెడలు వంచైనా ఉద్యోగాలు సాధించుకుందాం అన్నారు. అబద్ధాల సర్కార్పై ఇక యుద్ధం మొదలు పెట్టాలని గ్రామ జిల్లా స్థాయిల్లో నిరుద్యోగులు ఆందోళనలు చేయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగులు బయటకు వస్తే ప్రభుత్వం గడగడలాడాలన్నారు. ఆగస్టులో సరూర్నగర్ ఇండోర్ స్టేడియం గ్రౌండ్లో నిరుద్యోగులతో భారీ సభ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు గండి సన్నీయాదవ్, భవాని ప్రవీణ్కుమార్, విఠర్రెడ్డి, శ్రీశైలంయాదవ్, కృష్ణయాదవ్, నిరుద్యోగ జేఏసీ నాయకులు ఇంద్రనాయక్, కుమార్, ఆకాష్, శంభునాయర్. నవీన్, ఉపేందర్, అశోక్, సింధు, విక్రమ్: దామోదర్రెడ్డి. అశోక్. సాలాస్, పలువురు ప్రజాప్రతినిధులు నిరుద్యోగ యువత పాల్గొన్నారు.


# రిపోర్టర్లు కావలెను

V3 NEWS | ప్రజా "విశ్వంభర" తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108